

కంటైనర్ కిందపడి నుజ్జునుజ్జయిన కారు

రోడ్డుపై మృతదేహాలు

ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు

మరోసారి రక్తమోడిన భాకరాపేట ఘాట్

తిరుమల నుంచి తిరిగివెళ్తూ ప్రాణాలు కోల్పోయిన చిక్‌బళ్లాపురవాసులు



మృతులు మునివెంకటరెడ్డి, మంజునాథ, రమేష్‌మూర్తి (ఫైల్‌ఫొటోలు)

గాయపడ్డ అల్లావుద్దీన్

చంద్రగిరి, సెప్టెంబరు 12:తిరుపతి-మదనపల్లె రహదారిలోని భాకరాపేట ఘాట్ మరోసారి రక్తమోడింది. తరచూ ప్రమాదాలతో వార్తల్లో వుండే ఈ రోడ్డులో గురువారం జరిగిన అనూహ్య సంఘటనతో కర్ణాటకవాసులు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.పోలీసుల కథనం మేరకు... కర్ణాటక రాష్ట్రం, చిక్‌బళ్లాపుర సమీపంలోని హరిస్థలకు చెందిన తేజస్ కుమార్(35) తన తండ్రి మునివెంకటరెడ్డి(55), బావమరిది మంజునాథ(38)తో కలిసి కారులో తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్ళి గురువారం మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. గోలచిందెనహళ్ళికి చెందిన రమేష్‌మూర్తి(34) కారు నడుపుతున్నాడు. 2గంటల సమయంలో భాకరాపేట ఘాట్ రోడ్డులో వెళ్తుండగా కలకడ నుంచి చెన్నైకి టమోటాలను తీసుకెళ్తున్న కంటైనర్ మలుపు వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న వీరి కారుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయిపోయింది. సమాచారం అందుకున్న చంద్రగిరి, భాకరాపేట సీఐలు సుబ్బరామిరెడ్డి, ఇమ్రాన్‌బాషా, కళ్యాణి డ్యామ్ వద్ద వున్న పోలీసు శిక్షణ కళాశాల ఎస్‌ఐలు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు.పొక్లయినర్‌తో కంటైనర్ కింద వున్న కారును బయటకు తీసేందుకు సాధ్యం కాకపోవడంతో తిరుపతి నుంచి ఒక క్రేన్, భాకరాపేట నుంచి మరో క్రేన్ రప్పించారు.ఈలోపు పోలీసులతో పాటు ఆ దారిలో వెళుతున్న వాహనదారులు కంటైనర్‌లో ఉన్న టమోటా బాక్సులను బయటకు తీశారు. మూడు గంటల సమయంలో క్రేన్ సాయంతో కంటైనర్‌ను అతి కష్టంపై పైకి తీసి, కారులోంచి కేకలు వేస్తున్న తేజస్ కుమార్‌ను బయటకు తీశారు.చికిత్స నిమిత్తం 108 వాహనంలో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు.కారులోనే ఇరుక్కుపోయి మృతి చెందిన రమేష్ మూర్తి, మంజునాథ, మునివెంకటరెడ్డి మృత దేహాలను బయటకు తీశారు.ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ నర్సింగప్ప సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. మృతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించే ఏర్పాట్లు చేశారు.తరచూ ఇదే ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్న ఎస్పీ జాతీయ రహదారి అధికారుల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలను చేపడతామని తెలిపారు. కాగా కంటైనర్ డ్రైవర్ అల్లాహుద్దీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఐదు కిలో మీటర్ల దూరం స్తంభించిన ట్రాఫిక్

భాకరాపేట ఘాట్‌లో ఈ ప్రమాదంతో సుమారు ఐదు కిలో మీటర్ల దూరం వాహన రాకపోకలు స్తంభించి పోయాయి.కంటైనర్ కింద కారులోని మృత దేహాలను బయటకు తీయడానికి సాయంత్రం 4గంటలైంది.తరువాత కంటైనర్‌ను పక్కకు తీసి, వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు.ఆ లోపు తిరుపతి నుంచి మదనపల్లె, పీలేరుకు వెళ్ళే వాహనాలను చంద్రగిరి మండలంలోని ఎ.రంగంపేట నుంచి నారావారిపల్లె, కొత్తపేట మీదుగా భాకరాపేటకు పంపించారు.మరికొన్ని వాహనాలను ఎ.రంగంపేట నుంచి ఐతేపల్లె,దామలచెరువు మీదుగా పీలేరుకు పంపించారు.

జగన్‌తో పలువురు నేతల భేటీ

తిరుపతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌ను గురువారం చిత్తూరు,తిరుపతి జిల్లాలకు చెందిన పార్టీ నేతలు పలువురు కలిశారు. మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కళత్తూరు నారాయణస్వామి, ఆర్కే రోజా, ఎంపీ మిధున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బియ్యపు మధుసూదనరెడ్డి, వెంకటే గౌడ, డాక్టర్ సునీల్, ఇటీవలి ఎన్నికల్లో పోటీ చేసిన మోహిత్‌రెడ్డి, అభినయ్, నిషార్ అహ్మద్, రాజేష్, కృపాలక్ష్మి, విజయానంద రెడ్డి,నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి,సంజీవయ్య, మేరిగ మురళీధర్ తదితరులు గురువారం తాడేపల్లిలోని వైసీపీ ప్రధాన కార్యాలయంలో జగన్‌తో భేటీ అయ్యారు. నిజానికి ఎన్నికల ఫలితాలతో షాక్‌కు గురైన వైసీపీ నేతలు నైరాశ్యంలో కూరుకుపోయారు.చాలామంది ఇరుగుపొరుగు రాష్ట్రాలకు వెళ్ళిపోయి వ్యాపార పనుల్లో నిమగ్నమయ్యారు. మరికొందరు స్థానికంగానే వున్నా రాజకీయంగా క్రియాశీలం కాకుండా నిరాసక్తంగా వుంటున్నారు. దీనికి తోడు అధినేత కూడా రాష్ట్రంలో కాకుండా బెంగళూరులో ఎక్కువగా వుంటుండడంతో గత మూడు నెలల కాలంలో పెద్దగా వీరు కలిసింది లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల అరెస్టయి జైలులో వున్న బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పరామర్శించేందుకు జగన్ రాష్ట్రానికి రావడంతో వీరంతా తాడేపల్లి చేరుకుని జగన్‌ను కలిశారు. కొందరు బుధవారమే వెళ్ళగా మరికొందరు గురువారం వెళ్ళి అందరూ కలసి బృందంగా వెళ్ళి అధినేతతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కొంతసేపు ఉమ్మడి జిల్లాలో నెలకొన్న పరిస్థితులను జగన్ ఆరా తీసినట్టు తెలిసింది. నియోజకవర్గాల వారీగా పరిస్థితిని ఆయా నేతలను ప్రశ్నించి తెలుసుకున్నట్టు సమాచారం.



దేవర సినిమా చూసి చచ్చిపోతా

అమ్మా.. అప్పటిదాకా బతికించండి

తిరుపతిలో బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న యువకుడి వేడుకోలు



ఆసుపత్రిలో కౌశిక్

తిరుపతి(విద్య), సెప్టెంబర్ 12 : "నా బిడ్డకి బ్లడ్ కేన్సర్. జూనియర్ ఎన్టీయార్‌కి వీరాభిమాని. రోజు రోజుకీ పరిస్థితి విషమిస్తోంది. 'అమ్మా దేవర సినిమా చూసి చచ్చిపోతా.. 27వ తేదీ దాకా నన్ను బతికించండి..' అని వేడుకుంటున్నాడు" అంటూ 19 ఏళ్ల కౌశిక్ తల్లి సరస్వతి కన్నీరు మున్నీరవుతూ వెల్లడించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం తమ బిడ్డ పరిస్థితి గురించి మీడియాకు వివరిస్తూ సాయం చేయండంటూ ఆమె వేడుకున్నారు. టీటీడీలో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు, సరస్వతి దంపతుల పెద్ద కుమారుడు కౌశిక్ ఇంటర్ చదువుతుండగా అనారోగ్యానికి గురయ్యాడు. బ్లడ్ కేన్సర్ అని నిర్ధారణ కావడంతో 2022 నుంచీ చికిత్స తీసుకుంటున్నాడు.బోన్‌మారో చేయాలని వైద్యులు చెప్పారు. హైదరాబాద్‌లోని బసవతారకం కాన్సర్

● బతికించండంటూ తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు

ఆసుపత్రి సహా చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు తిరిగారు. ప్రస్తుతం బెంగళూరులోని కిడ్‌వై హాస్పిటల్లో కౌశిక్ చికిత్స పొందుతున్నాడు. బోన్‌మారో చికిత్సకు దాదాపు రూ.60 లక్షలకు పైగానే ఖర్చవుతుందని తెలియడంతో తల్లిదండ్రులు హతాశులయ్యారు. రోజు రోజుకూ మరణానికి దగ్గరవుతున్న కొడుకును చూస్తూ వారు దుఃఖిస్తున్నారు. దాతలు ముందుకు వస్తే బిడ్డ బతుకుతాడని ఆశపడుతున్నారు. వారి వేదన చూసి 'అమ్మా నేను బతకనని నాకు తెలుసు.. నా కోసం బాధపడకండి.. దేవర సినిమా దాకా బతికించండి చాలు.. నా చివరి కోరిక తీర్చండి' అంటూ తమను బిడ్డ సముదాయిస్తున్నాడని చెబుతూ, కౌశిక్‌కి ప్రాణదానం చేయండంటూ ఆ తల్లిదండ్రులు చేతులు జోడిస్తున్నారు. 9490829381 నెంబరుకు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా గానీ లేదా కె. సరస్వతి, యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 103310100044506, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0801313కు గాని దాతలు తమ సాయాన్ని అందించవచ్చు.సమాచారం కోసం 79956 65169 నెంబరులో కౌశిక్ తల్లిదండ్రులను సంప్రదించవచ్చు.



కలెక్టర్‌కు చెక్ అందజేస్తున్న మెప్మా పీడీ రాధమ్మ తదితరులు

వరద బాధితుల సహాయార్థం విరాళాల వెల్లువ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 12: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి గురువారం కూడా జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది విరాళాలను కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు. ● జిల్లా మెప్మా పీడీ రాధమ్మ తమ శాఖ తరఫున ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.4,34,500 చెక్‌ను తమ శాఖాధికారులతో కలిసి అందజేశారు. ● జిల్లా నీటిపారుదల శాఖ విజయ్‌కుమార్ తన వంతుగా రూ.44 వేల చెక్కును అందజేశారు. ● ఎస్పీ కార్యాలయ సిబ్బంది రూ.20 వేల చెక్కును అందజేశారు. ● జిల్లా ఖజానా శాఖ అధికారి రవికుమార్ తన వంతుగా రూ.10 వేల చెక్‌ను అందజేశారు.

కార్పెంటర్ల సాయం రూ.1.15లక్షలు

చంద్రగిరి, సెప్టెంబరు 12: వరద బాధితులను ఆదుకోవడానికి రాష్ట్రంలోని కార్పెంటర్లందరూ కలిసి తమ యూనియన్ ద్వారా గురువారం రూ.1.15 లక్షల చెక్‌ను సీఎం చంద్రబాబుకు విజయవాడలో అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులతోపాటు జిల్లాకు చెందిన నాయకులు సురేంద్రబాబు, మోహనాచారి తదితరులున్నారు.



సీఎం చంద్రబాబుకు చెక్ అందజేస్తున్న కార్పెంటర్లు

వృషభుడిపై మూషిక వాహనుడు



వృషభ వాహనంపై ఉత్సవర్ల ఊరేగింపు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 12: కాణిపాక వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం చిలుక.. రాత్రి వృషభ వాహనాలపై ఉత్సవర్లు ఊరేగారు. చిలుక వాహన సేవకు కాణిపాకానికి చెందిన ఆర్యవైశ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వృషభ వాహన సేవకు కాణిపాకం, సంతపల్లె, మారేడుపల్లె, ముదిగోళం, చిత్తూరుకు చెందిన శాలివాహన వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకురావడంతో ఆలయ కల్యాణ వేదికపై సిద్ధి, బుద్ధి సమేత స్వామివారి ఉత్సవర్లకు పూజలు నిర్వహించారు. వృషభ వాహనంపై ఆశీనులను చేసి కాణిపాక పురవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈవో గురుప్రసాద్. ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి, ఉభయదారులు పాల్గొన్నారు.

ఘనంగా రథ కలశ పూజ

బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం నిర్వహించనున్న రథోత్సవానికి గురువారం రథ కలశ పూజ నిర్వహించారు.ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, రథ కలశ అభిషేకం, రథ సారథి పూజ, సంప్రోక్షణ జరిగింది. స్వామివారి గొడుగులను అర్చి రథ కలశాన్ని గ్రామంలో ఊరేగించారు. రథ శిఖరంపై కలశాన్ని ప్రతిష్ఠించారు. రథోత్సవానికి రథాన్ని సిద్ధం చేశారు.



చిలుక వాహనంపై ఊరేగుతున్న వరసిద్ధుడు

తిరుపతిలో 18 నెలల బాలుడి అదృశ్యం



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 12: తిరుపతిలో 18 నెలల బాలుడు అదృశ్యమయ్యాడు. ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నేపాల్‌కు చెందిన కైలాస్, మౌనీషా దంపతులు 20 ఏళ్ల కిందట తిరుపతికి వలస వచ్చారు. శ్రీనివాసపురంలోని గోకుల నిలయంలో కైలాస్ వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. వీరికి 18 నెలల బాలుడు బాలాజీ ఉన్నాడు. భార్య, బిడ్డతో కలిసి బుధవారం రాత్రి బజారులో నిత్యావసరాలు కొనుగోలు చేసి, ఇంటికెళ్లడానికి ఆటో ఎక్కాడు. అప్పటికే ఫూటుగా మద్యం తాగి ఉన్న కైలాస్.. టౌన్‌బ్యాంకు ఎదురుగా ఉన్న వినాయకస్వామి ఆలయం వద్దకొచ్చేసరికి ఆటోని ఆపి దిగేశాడు. భర్త దిగి పోవడంతో కంగారుగా బిడ్డను చూసుకోకుండా భార్య కూడా ఆటో దిగేసింది. కొంతసేపటికి బిడ్డ కనిపించలేదని దంపతులు గుర్తించి చుట్టుపక్కల వెతికాడు. ఫలితం లేకపోవడంతో గురువారం ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాలతో రెండు ప్రత్యేక టీమ్‌ల ద్వారా డీఎస్పీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో సీఐ మహేశ్వరరెడ్డి గాలింపు చర్యలు చేపట్టారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



ఎస్టీవో జ్ఞానప్రసూనకు వినతి పత్రం అందజేస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

పాకాల, సెప్టెంబరు 12: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు కోరారు. స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో గురువారం కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్టీవో జ్ఞానప్రసూనకు సమస్యలపై అసోసియేషన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. పీపీవోలో ఫ్యామిలీ పెన్షనర్ల పుట్టినతేది నమోదు చేయాలని, పెన్షనర్లకు చెల్లించాల్సిన డీఏ బకాయిలు, 11వ పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. భార్యాభర్తలు పెన్షనర్లయితే ఈహెచ్‌ఎస్ చందా ఒకరి నుంచి మాత్రమే మినహాయించుకోవాలని కోరారు. పీపీవోల బదిలీ కోరి దరఖాస్తు చేసుకున్న పెన్షనర్లకు వారు కోరిన ఎస్టీవోలకు బదిలీ చేయాలని, పెన్షనర్ల డేటాను అప్‌డేట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరామ నాయుడు, పాకాల యూనిట్ అధ్యక్షుడు పిఆర్ మునస్వామి, ప్రధాన కార్యదర్శి ఎం.కుప్పుస్వామి నాయుడు, కోశాధికారి కె.రామమూర్తి, అబ్దుల్ గఫూర్, జి.రామయ్యా తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొరపై వ్యాసరచన పోటీలు



పాకాల, సెప్టెంబరు 12: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఓజోన్ డేని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో బాబ్జీ మాట్లాడుతూ సూర్యుడి నుంచి విడుదలయ్యే ప్రమాదకరమైన అతినీలలోహిత కిరణాలను భూమిమీద పడకుండా ఓజోన్ పొర రక్షణ కల్పిస్తుందన్నారు. వాతావరణ కాలుష్యం వలన ఓజోన్ పొర దెబ్బతింటుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటి సంరక్షించి కాలుష్యాన్ని తగ్గించాలని కోరారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయులు జయచంద్ర, కొండయ్య, ధర్మేంద్ర, నాగేంద్ర, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మోటరు సైకిల్ దగ్ధం

పాకాల, సెప్టెంబరు 12: మండలంలోని పేరసానిపల్లె పంచాయతీ గుండ్లగుట్టపల్లెలో గుర్తుతెలియని వ్యక్తులు మోటరుసైకిల్‌ని దగ్ధం చేశారని బాధితుడు ధనుంజయ పాకాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి: ఎస్టీయూ



మాట్లాడుతున్న మల్లేశ్వర్

ఎర్రావారిపాలెం, సెప్టెంబరు 12: ఉద్యోగులకు వెంటనే 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అంజిమేటి మల్లేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 11వ పీఆర్సీలో తమకు అన్యాయం చేసిందన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని వెంటనే ప్రస్తుత ప్రభుత్వం 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం జీవో నెంబరు 117ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 3,4,5 తరగతుల విలీనం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావ్యవస్థ కుంటు పడిందన్నారు. 12వ పీఆర్సీ కమిటీకి కమిషనర్‌ను నియమించి నివేదిక సకాలంలో తెప్పించి, అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో డివిజనల్ కార్యదర్శి మంచినీళ్ల వెంకట్రామణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటాద్రి, హనుమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గజరాజుల దాడిలో పంటల ధ్వంసం



రాగిమానుకుంట వద్ద ధ్వంసమైన పంట పొలాలు

చంద్రగిరి, సెప్టెంబరు 12: చంద్రగిరి మండలం, ఎ.రంగంపేట అటవీ ప్రాంత సమీపంలో బుధవారం రాత్రి ఏనుగులు వరి పంటను ధ్వంసం చేశాయి. కళ్యాణి డ్యామ్ ఫిల్టర్ హౌస్ సమీపంలో నుంచి వచ్చిన సుమారు 8 ఏనుగులు ఎ.రంగంపేట పంచాయతీలోని రాగిమానుకుంట ఎస్టీ కాలనీలో రెండు ఎకరాలకు పైగా వరి పంటను ధ్వంసం చేశాయి. రైతు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... తన పొలంలో చేతికందిన పంటను ఏనుగులు ధ్వంసం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది ధ్వంసమైన పంటలను పరిశీలించి, ప్రభుత్వం నుంచి తగిన నష్ట పరిహారం చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చేతివృత్తులతో ఆర్థికంగా ఎదుగుదల



కుట్టుమిషన్ శిక్షణను ప్రారంభిస్తున్న రాస్ ప్రతినిధులు

రామచంద్రాపురం, సెప్టెంబరు 12: మహిళలు తీరిక వేళల్లో చేతివృత్తులతో ఆర్థికంగా ఎదగాలని రాస్ కోఆర్డినేటర్ హరిబాబు నాయుడు కోరారు. బ్రాహ్మణకాల్వ దళితవాడలో గురువారం టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని రాస్ పొదుపుసంఘాల సంచాలకులు నాగరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాస్ సిబ్బంది నాగేశ్వర రావు, మునిరాజా, లావణ్య పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



రామచంద్రాపురం, సెప్టెంబరు 12: కుప్పంబాదూరు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివే 65మంది విద్యార్థులకు సొసైటీ ఫర్ సోషల్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గురువారం విద్యాసామగ్రి పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా పలువురు స్వచ్ఛంద సంస్థల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటరమణ, డీవైఈవో బాలాజీ, ఎంఈవోలు మార్కండేయ నాయుడు, జయవేలు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫాంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్

రామచంద్రాపురం, సెప్టెంబరు 12: మండలంలోని రాయలచెరువుపేటలో గురువారం ఆయిల్‌ఫాం సాగుపై అవగాహన సదస్సు జరిగింది.ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి సునీల్ మాట్లాడుతూ హెక్టార్‌కు 143 మొక్కలను రూ.193 చొప్పున ప్రభుత్వం వందశాతం రాయితీతో అందిస్తుందన్నారు. పంట నాలుగవ సంవత్సరం నుంచి కోతకు వస్తుందని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు 3ఎఫ్ కంపెనీ రైతుల నుంచి కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కో రారు. రైతు భరోసా కేంద్ర సిబ్బంది డిల్లీరాణి, కీర్తన పాల్గొన్నారు.



చంద్రగిరిలో పూడ్చివేసిన మురుగు కాలువ



నూకలకుంటలోకి మురుగు నీటిని మళ్లించిన దృశ్యం



మురుగు నీటితో నిండిన నూకలకుంట

ఆక్రమణలకు గురైన నూకలకుంట

- మురుగునీటి నిల్వతో సమీప ప్రాంతాల్లో కలుషితమైన భూగర్భ జలాలు
- రోగాల బారిన చంద్రగిరి ప్రజలు - పట్టించుకోని అధికారులు

చంద్రగిరి, సెప్టెంబరు 12: చంద్రగిరి పట్టణ నడిబొడ్డున ఉన్న నూకలకుంట ఆక్రమణలకు గురై మురుగు నీరు నిల్వ ఉండటంతో సమీపంలోని భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. దీంతో ఈ కుంట పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులు, ప్రజలు నిత్యం రోగాల బారిన పడుతున్నారు. చంద్రగిరి నడిబొడ్డున సుమారు 9 ఎకరాల విస్తీర్ణంలో ఉండే నూకలకుంట ఆక్రమణలకు గురి కావడంతో ప్రస్తుతం 3.50 ఎకరాలు మాత్రమే మిగిలింది. ఈ కుంటలోకి చేరిన వర్షపు నీరు చంద్రగిరి పరిసరాల్లో 50 ఎకరాల్లో పంటలు సాగు చేసుకోవడానికి ఉపయోగపడేది. కొత్తపేటలోని చంద్రగిరి-తిరుపతి రహదారి పక్కనే ఉన్న కాలువలను కూడా పూడ్చివేసి, ఇంటి నిర్మాణాలు చేపట్టారు. దీంతో నూకలకుంట నుంచి బయటకు వెళ్లే నీటి పారుదల కూడా నిలిచిపోయింది. కాగా సమీపంలోని నివాసాల నుంచి వచ్చే మురుగు నీటిని స్థానికులు కుంటకు మళ్లించారు. ఏళ్ల తరబడి మురుగు నీరు నిల్వ ఉండటంతో సమీప ప్రాంతాల్లోని భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. భూములు చౌడుబారుతుండటంతో రైతులు కూడా ఈ నీటిని సాగుకు వినియోగించుకోవడంలేదు. చంద్రగిరి ప్రభుత్వ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల, బాలికల వసతి గృహం, ఎస్సీ బాలుర వసతి గృహాలకు ఆనుకొని నూకలకుంట ఉంది. దీంతో కుంట సమీపంలో ఉన్న బోర్లలో కలుషిత నీరు తాగడంతో విద్యార్థులతో పాటు పరిసరాల్లో ఉన్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీనిపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇకనైనా అధికారులు స్పందించి ఆక్రమణలకు గురైన మురుగు కాలువలను పునరుద్ధరించి, నూకలకుంటలోకి మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకుని, సమీపంలో వెలసిన ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పిచ్చిమొక్కల తొలగింపు

పాకాల, సెప్టెంబరు 12: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మండల టీడీపీ ఆధ్వర్యంలో పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు ఏపుగా పెరిగాయి. పాముల సంచారంతో ఆస్పత్రి సిబ్బంది, రోగులు భయం భయంగా గడిపేవారు. ఇటీవల ఈ సమస్యలను గుర్తించిన ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో పిచ్చిమొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. దీంతో మండల టీడీపీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. శ్రమదానం, ఎక్స్‌వేటర్‌తో పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ బోయపాటి నాగరాజ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.





పాకాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌వేటర్‌తో పిచ్చిమొక్కల తొలగింపు - తొలగింపుతో పరిశుభ్రంగా వున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వెనుకభాగం



పట్టుబడిన కొండచిలువతో భాస్కర నాయుడు

తిరుమలలో 10 అడుగుల కొండచిలువ పట్టివేత

తిరుమల, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం సుమారు పది అడుగుల పొడవైన కొండచిలువ పట్టుబడింది. సేవాసదన్-2 గార్డెన్‌లోకి వచ్చిన ఈ పామును పలువురు సేవకులు, సిబ్బంది గమనించి హడలిపోయారు. భద్రతాసిబ్బంది సహాయంతో పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర నాయుడికి సమాచారమిచ్చారు. వెంటనే అయన అక్కడికి చేరుకుని కొండచిలువను చాకచక్యంగా పట్టుకుని దట్టమైన అడవిలో విడిచిపెట్టారు.



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ముత్యాల పార్థసారథి

టౌన్‌ప్లానింగ్ అధికారిపై రెచ్చిపోయాడు!

- దుర్భాషలాడిన శ్రీకాళహస్తి మున్సిపల్ మాజీ చైర్మన్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12: శ్రీకాళహస్తి పురపాలకసంఘంలో టౌన్‌ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న మధుసూదనరావుపై మాజీ చైర్మన్ ముత్యాల పార్థసారథి బూతు పదజాలంతో రెచ్చిపోయాడు. ముక్కంటి ఆలయం ఎదుట జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ముక్కంటి ఆలయ నాల్గవ గేటు ఎదురుగా కృష్ణమందిరం పక్కనే సన్నిధివీధి రోడ్డుకు అనుకుని చాలాకాలంగా దుకాణాలున్నాయి.కృష్ణ మందిరం దక్షిణం వైపున ఒక వ్యక్తి రేకులతో తాత్కాలికంగా నిర్మించిన దుకాణాలు నడుపుకునేవాడు. ఇటీవల ఆ రేకులు తొలగించి శ్లాబ్‌తో శాశ్వత నిర్మాణం చేపట్టాడు. దీనిపై ఇన్‌ఛార్జి కమిషనర్ లలితకు కొందరు ఫోన్‌లో ఫిర్యాదు చేయడంతో టౌన్‌ప్లానింగ్ అధికారి మధుసూదన రావు సిబ్బందితో సన్నిధివీధికి చేరుకుని అక్కడ నిర్మాణంపై ఆరాతీశారు. రికార్డు ప్రకారం అది రోడ్డు పొరంబోకు స్థలం కాబట్టి శ్లాబ్ వేసేందుకు అనుమతి లేదంటూ పనులను అడ్డుకున్నారు.నిర్మాణం చేపట్టిన వ్యక్తి పురపాలకసంఘ మాజీ చైర్మన్ ముత్యాల పార్థసారథికి ఫోన్ చేసి పిలిచాడు.ఆయన రాగానే కృష్ణమందిరం పక్కన ఎన్నో శాశ్వత భవనాలు, నిర్మాణాలు ఉన్నప్పుడు ఈ ఒక్క నిర్మాణాన్ని ఎందుకు అడ్డుకుంటున్నారంటూ ప్రశ్నించారు.నీకు వగ ఉంటే అన్నీ కొట్టుకుంటూ రా... అంటూ దుర్భాషలాడారు.ఇదంతా ఎవరో వీడియో తీసి పెట్టడంతో సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది.ఈ విషయమై టౌన్ ప్లానింగ్ అధికారిని పార్థసారథి బూతు పదజాలంతో దూషించారంటూ ఇన్‌ఛార్జి కమిషనర్ లలిత ఓ పత్రికా ప్రకటన విడుదల చేసి ఊరుకున్నారు.టౌన్‌ప్లానింగ్ అధికారి మధుసూదన రావు మాత్రం పోలీసులకు ఫిర్యాదు చేసే అంశంపై అధికారులతో మాట్లాడి చెబుతానని తెలిపారు. కాగా 2019 వరకు టీడీపీలో కీలక నేతగా వుండిన ముత్యాల పార్థసారథి ఏడాది క్రితం వైసీపీలో చేరారు.ఈ యేడాది మార్చిలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత మళ్లీ టీడీపీలో చేరారు.

కలుషిత 'గంగ'



గేటువాల్వ్ లీకై నిల్వ ఉండటంతో పచ్చగా మారిన తెలుగుగంగ నీరు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 12: కలుషిత నీరు కారణంగా నగర ప్రజలు తరచూ అనారోగ్యంతో ఆస్పత్రి పాలవుతున్నా సంబంధిత విభాగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. మంగళం టూ తిరుచానూరు రైల్వేస్టేషన్ వరకు నిర్మిస్తున్న రోడ్డు చివర్లో మలుపు వద్ద (శెట్టిపల్లె రైల్వేగేటు సమీపంలో) గేటువాల్వ్ ఉంది. మరమ్మతు కారణంగా లీకవుతూ గుంతగా ఏర్పడి నెలల తరబడి నీరు నిల్వ ఉండటంతో పచ్చగా ఉంటోంది. ఇక్కడ నీటిని పలువురు కాలకృత్యాలు తీర్చుకోవడానికి వినియోగిస్తుండగా, గేదెలు, ఇతర జీవులు జలకాలాడుతున్నాయి. దీంతో నీరు రంగుమారి దుర్వాసన వస్తోంది. ఈగలు, దోమలు కూడా వాలుతున్నాయి. గంగ సరఫరాలో ఉధృతి సమయంలో నీరు బయటకు రావడం, తగ్గినప్పుడు కలుషితనీరు పైపుల్లోకి ప్రవేశిస్తోంది. దీంతో నగరానికి సరఫరా అవుతున్న నీరు కలుషితమవుతోందనడానికి ఇదొక చక్కటి నిదర్శనం. నగరపాలక సంస్థలోని వాటర్‌వర్క్స్ విభాగం స్పందించి నీరు లీకవకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సరస్వతి అలంకారంలో శక్తిగణపతి



రామచంద్రాపురం, సెప్టెంబరు 12: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీశక్తిపీఠంలో వెలసిన శక్తిగణపతి గురువారం సరస్వతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శక్తిగణపతికి తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం వేద పండితులు లక్ష కుడుములతో సరస్వతి మేదోష గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఆటోలో 15 సవర్ల బంగారం చోరీ

రేణిగుంట, సెప్టెంబరు 12: ఆటోలో 15 సవర్ల బంగారు నగలు చోరీ అయ్యాయి.బాధితురాలు కథనం ప్రకారం..కార్వేటినగరంలో ఉంటున్న వకీషా ఏర్పేడులో శుభ కార్యానికి హాజరయ్యేందుకు గురువారం బంధువులతో కలిసి ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. గాజులమండ్యం కూడలి వద్ద సాయంత్రం దిగి. అక్కడి నుంచి బంధువు ద్విచక్ర వాహనంలో పాత చెక్‌పోస్టు వద్దకు చేరుకుంది. తర్వాత షేర్ ఆటోలో ఏర్పేడు ప్రయాణిస్తుండగా ఇద్దరు మహిళలు వకీషా పర్సులోని 15 సవర్ల బంగారు నగలను చోరీ చేశారు. బంధువుల ఇంటికి వెళ్లిన తరువాత చోరీ అయిన విషయాన్ని ఆమె గుర్తించింది. రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితురాలు పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కంటి ఆలయంలో నేటి నుంచి పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఉత్సవాలు శుక్రవారం నుంచి మంగళవారం వరకు జరుగుతాయన్నారు. భక్తులు, సిబ్బంది తెలియక చేసిన దోషాల నివారణకు ఏటా ఇలా పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు.

ఆగిన వీధిలైట్ల అమరిక

- ఎక్కడికక్కడ స్తంభించిన పనులతో ట్రాఫిక్‌కు అంతరాయం



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 12: కరకంబాడి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వీధిలైట్ల పనులను అర్ధాంతరంగా నిలిపేశారు. దీంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. కరకంబాడిరోడ్డులోని వెంకటేశ్వరకాలనీ నుంచి కరకంబాడి వరకు రహదారి మధ్యలో టీటీడీ ఆధ్వర్యంలో నూతనంగా వీధి లైట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. గ్రౌండ్ వర్క్ పూర్తి చేసి మిగిలిన సగభాగం పనులు ఆపేశారు. రోడ్డుమధ్యలో గుంతల తవ్విన మట్టి, బారికేడ్లు అలాగే వదిలేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. తరచూ ట్రాఫిక్ స్తంభించి వాహనాలు బారులు తీరుతున్నాయి. రాత్రివేళలలో అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాకుండా ప్రజారవాణాకు, ద్విచక్రవాహనచోదకులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. ఈ సమస్యను గుర్తించి ఆ పనులు చేపట్టిన సంబంధిత విభాగం త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఫ్రీహోల్డ్ భూములపై సీఐడీ విచారణ

- మదనపల్లె సబ్‌కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో తనిఖీలు
- నలుగురు రైతుల స్టేట్‌మెంట్ల రికార్డు..!



మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలోకి విచారణకు వెలుతున్న సీఐడీ అధికారులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 12: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం కేసులో సీఐడీ అధికారులు మరో అడుగు ముందుకు వేశారు. గురువారం సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో అధికారులు స్థానిక సబ్ కలెక్టరేట్‌లో విచారణకు వచ్చారు. ఈ సందర్భంగా పెద్దమండ్యం మండలం ముసలికుంటకు చెందిన భూముల విషయమై శిరీష అనే రైతు డాటెడ్ ల్యాండ్ (చుక్కల భూమి) విషయమై ఫ్రీహోల్డ్‌కు దరఖాస్తు చేసుకుంది. దీనికి సంబంధించి ముసలికుంట వీఆర్వో, విలేజ్ సర్వేయర్‌ను విచారించారు. అంతేకాకుండా రైతు శిరీషా దరఖాస్తు వివరాలు, భూమి వివరాలను జిరాక్స్ తీసుకున్నట్లు సమాచారం. అనంతరం మదనపల్లె తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న సీఐడీ అధికారులు తహసీల్దార్ ఖాజాబీ సమక్షంలో పలు రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా కోళ్లబైలు, వలసపల్లె, బసినికొండ గ్రామాలతో పాటు మరో గ్రామానికి చెందిన రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఈ నాలుగు రెవెన్యూ గ్రామాల్లో ఫ్రీహోల్డ్ భూముల కోసం దరఖాస్తు చేసుకున్న నలుగురు రైతులను పిలిపించి విచారించారు. ఎప్పుడు దరఖాస్తు చేసుకున్నారు..? ఎవరు రెకమండేషన్ చేశారు..? ఏ అధికారి అయినా వ్యక్తిగతంగా మాట్లాడారా తదితర వివరాల గురించి రైతులను విడివిడిగా అడిగినట్లు సమాచారం. దీంతో పాటు నలుగురు రైతుల వద్ద స్టేట్‌మెంట్లు రికార్డు చేసుకున్నట్లు తెలిసింది. కాగా మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం ఘటన జరిగి 50 రోజులు గడుస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆగస్టు 6వ తేదీ ఈ కేసును సీఐడీ అధికారులకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఇందులో భాగంగా సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మదనపల్లెకు వచ్చి సబ్‌కలెక్టరేట్‌లో ఘటన జరిగిన భవనంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. అనంతరం సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో పలుమార్లు రెవెన్యూ అధికారులను,రైతులను విచారిస్తూనే ఉన్నారు. అలాగే అనుమానం వున్న సర్వే నెంబర్ల వివరాలు, ఫ్రీహోల్డ్ భూ ముల దరఖాస్తు దారులను విచారిస్తున్నారు. ఫైళ్ల దహనం కేసులో ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్టుల ఆధారంగానే కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ రిపోర్టులు ఇప్పటికే సీఐడీ అధికారులకు చేరా యా..? లేక ఇంకా ఆలస్యం అవుతుందా అనే అంశంపైనే అందరి దృష్టి ఉంది.

ఎనిమిది మంది ఎక్కడ ఉన్నారో..?

మదనపల్లె ఫైళ్ల దహనం కేసులో మదనపల్లె వన్‌టౌన్, టూటౌన్, తాలూకా పోలీసు స్టేషన్‌లలో పోలీసులు ఎనిమిది కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుల్లో నిందితులుగా ఉన్న వి.మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా, శశికాంత్, రామకృష్ణారెడ్డి, ము న్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ, మరో ఇద్దరిపై కేసులు నమోద య్యాయి. అప్పటి నుంచి వీరందరూ మదనపల్లె విడిచి వెళ్లారని తెలుస్తోంది. ఇందులో ఇద్దరికి హైకోర్టు బెయి ల్ ఇచ్చిన క్రమంలో వారిద్దరూ మదనపల్లెకు వచ్చినా, గత పది రోజుల క్రితం సీఐడీ అధికారులు మదనపల్లెకు విచారణకు వచ్చాక వీరిద్దరు కూడా మళ్లీ మదనపల్లె విడిచి వెళ్లినట్లు తెలుస్తోంది. సీఐడీ కేసులో సమ గ్ర విచారణ ముగిశాకే, సాక్ష్యాలు, ఆధారాలతో నిందితులను అరెస్టు చూపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



శ్రీవారి ఆలయం ముందు నివేదా తదితరులు

తిరుపతిలో సెటిలైతే బాగుంటుందన్పించింది

నివేదా థామస్

తిరుపతి అర్బన్/ తిరుమల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): '35 చిన్నకథ కాదు' సినిమా షూటింగ్ తిరుపతిలో జరిగినప్పుడు ఇక్కడే సెటిలైతే బాగుంటుందని అన్పించినట్లు హీరోయిన్ నివేదా థామస్ చెప్పారు. చెన్నైలో పుట్టి పెరిగిన తనకు తిరుపతి చాలా దగ్గరగా అన్పించిందన్నారు. '35 చిన్నకథ కాదు' సక్సెస్ టూర్‌లో భాగంగా గురువారం తిరుపతిలో చిత్రబృందంతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. థియేటర్‌లో ప్రేక్షకుల స్పందన చాలా బాగుందని హీరో విశ్వదేవ్ చెప్పారు. '35 చిన్నకథకాదు' సినిమాను 60శాతం తిరుపతిలో చిత్రీకరించామని, భారీ విజయం సాధించడం సంతోషంగా ఉందని దర్శకుడు నందకిషోర్, నిర్మాత సిద్ధార్థ అన్నారు.

శ్రీవారు మాతోనే ఉన్నారు

పెద్దాయన వేంకటేశ్వరస్వామి దయతోనే '35 చిన్న కథ కాదు' చిత్రం మంచి విజయాన్ని సాధించిందని చిత్రబృందం సంతోషం వ్యక్తం చేసింది.గురువారం ఉదయం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న చిత్రబృందం ఆలయం ముందు మీడియాతో మాట్లాడింది. నివేదా థామస్ మాట్లాడుతూ తొలిసారిగా తాను శ్రీవారి దర్శనానికి వచ్చినట్టు తెలిపారు. దర్శకుడు నందకిషోర్ మాట్లాడుతూ.. సినిమాది తిరుపతి కథ కావడంతో విజయయాత్రను కూడా ఇక్కడినుంచే మొదలుపెట్టామన్నారు.

పర్యాటకరంగం అభివృద్ధికి కృషి చేయాలి: కలెక్టర్



సమావేశంలో ప్రసంగిస్తున్న వెంకటేశ్వర్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 12: జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్‌తో కలిసి జిల్లా పర్యాటక శాఖ కౌన్సిల్ చైర్మన్ హోదాలో గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. జిల్లాలో పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. పర్యాటక ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడం వల్ల పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేయొచ్చని వివరించారు. యాత్రికులను ఆకర్షించే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేయాలని చెప్పారు. ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు లఘు చిత్రలేఖన పోటీలు నిర్వహించడం వల్ల వారికి పర్యాటకరంగంపై ఆసక్తితో పాటు ఆయా పర్యాటక ప్రదేశాల గురించి అవగాహన కలుగుతుందన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, ఎస్వీ జూపార్క్ క్యూరేటర్ సెల్వం, మెప్మా పీడీ ప్రభావతి, డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.56 కోట్లు

తిరుమల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.56 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి, గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 67,668 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,157 మంది తలనీలాలు సమర్పించారు.

నేటినుంచి తుమ్మలగుంట ఆలయంలో పవిత్రోత్సవాలు



ముస్తాబవుతున్న కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం

తిరుపతి రూరల్, సెప్టెంబరు 12: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. 13న సాయంత్రం 6గంటలకు అంకురార్పణ, 14న ఉదయం 9 గంటలకు పవిత్రాల ప్రతిష్ఠ, 15న ఉదయం 9.30గంటలకు మూలమూర్తితో పాటు పరివార దేవతామూర్తులు, ఉత్సవర్లు, ధ్వజపీఠం, గరుడాళ్వార్‌లకు పవిత్ర సమర్పణ చేయనున్నారు. 16న సాయంత్రం 5.15గంటలకు యాగశాలలోని హోమగుండంలో పూర్ణాహుతి నిర్వహించి ఉత్సవాలను ముగించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి కోరారు.

పాతకాల్వలో చెరువుకట్ట చదును



తిరుపతి రూరల్, సెప్టెంబరు 12: తిరుపతి రూరల్ మండలం పాతకాల్వ గ్రామానికి చెందిన చెరువుకట్టను ఆక్రమణదారులు గురువారం ఎక్స్‌వేటర్‌తో చదును చేశారు. పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన మార్గంలో వకుళామాత ఆలయ ఆర్చికి సమీపంలోని చెరువుకట్టకు చెందిన కొంతస్థలాన్ని ఎక్స్‌వేటర్ సాయంతో చదును చేసి ఉన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు స్పందించి ఈ విలువైనభూమి ఆక్రమణకి గురికాకుండా తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎడిఫై పాఠశాలకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న ప్రణీత్, డాక్టర్ కీర్తిప్రియ

తిరుచానూరు , సెప్టెంబరు 12: తిరుచానూరులోని ఎడిఫై విద్యాసంస్థ రాష్ట్రంలో ఉత్తమ పాఠశాలగా 7వ ర్యాంకు సాధించింది. ఢిల్లీకి చెందిన బ్రెయిన్‌ఫీడ్ మ్యాగజైన్ సంస్థ దేశవ్యాప్తంగా డే కో-ఎడ్ కేటగిరి కింద సీ ఫోర్ స్కూల్-2024 ర్యాంకింగ్ సర్వేలో తిరుపతి జిల్లాలో మొదటి స్థానం, రాష్ట్రంలో 7వ ర్యాంకును పొందింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో గురువారం బ్రెయిన్‌ఫీడ్ మ్యాగజైన్ ప్రతినిధులు బ్రహ్మం ప్రేమ్ నుంచి ఎడిఫై పాఠశాల డైరెక్టర్ పి.ప్రణీత్, డాక్టర్ కీర్తిప్రియలు ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రణీత్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థల అధ్యాపకులు, సిబ్బంది అంకిత భావంతో పనిచేయడంతోనే ఈ అవార్డును సాధించగలిగామన్నారు. ఎడిఫై డైరెక్టర్లను, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను పద్మావతి విద్యాసంస్థల అధినేత సులోచన అభినందించారు.

ఎంపీటీసీ శ్రీరాములురెడ్డి మృతి పట్ల సంతాపం

తిరుపతి రూరల్, సెప్టెంబరు 12: తిరుపతి రూరల్ మండలం సాయినగర్ పంచాయతీ ఎంపీటీసీ శ్రీరాములురెడ్డి మృతికి గురువారం పలువురు నివాళి అర్పించారు. ఎంపీపీ వేముల యశోద, మాజీఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సతీమణి లక్ష్మీతోపాటు పలువురు ఎంపీటీసీలు లింగేశ్వరనగర్‌లోని ఆయన ఇంటికి చేరుకుని పార్థివదేహానికి పుష్పాంజలితో నివాళి అర్పించారు. అనంతరం శ్రీరాములురెడ్డి కుటుంబసభ్యులను ఓదార్చారు.

ఎస్వీయూ మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్‌గా హేమ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 12: ఎస్వీయూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా పి.హేమ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఉన్న దివాకరరెడ్డి స్థానంలో ఈమెను నియమిస్తూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. 2007లో వర్సిటీలో అధ్యాపకులుగా చేరిన ఈమె.. ఉమెన్ హాస్టల్ డిప్యూటీ వార్డెన్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ మెంబర్‌గా పని చేశారు. ఒక పుస్తకం, 30 పరిశోధనా వ్యాసాలు రాశారు. బెస్ట్ రీసెర్చర్ అవార్డు, రాష్ట్రీయ విద్యా పురస్కారాన్ని స్వీకరించారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన హేమను ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

ఆత్మహత్య పరిష్కారం కాదు

కిమ్స్ డాక్టర్ హేమలత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 12: ఎలాంటి పరిస్థితుల్లోనూ మనిషికి ఆత్మహత్య పరిష్కారం కాదని హైదరాబాదులోని కిమ్స్ న్యూరో సైకాలజిస్టు డాక్టర్ హేమలత తెలిపారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. మనో స్థైర్యంతో జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కారం చేసుకోవాలన్నారు. రిజిస్ట్రార్ రజని, డీన్ కాత్యాయని, సైకాలజీ విభాగ అధ్యాపకులు డాక్టర్ గాయత్రి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరికి డాక్టరేట్ల ప్రదానం



సూర్యనారాయణ - చెంచులక్ష్మి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 12: ఎస్వీయూలో ఇద్దరికి డాక్టరేట్లు ప్రదానం చేసినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు. ● ఫిజిక్స్ స్కాలర్ బోనం సూర్యనారాయణ దేవర.. స్ట్రక్చరల్ అబ్జార్షన్ అండ్ ఎమిసన్ స్టడీస్ ఆన్ డిఫరెంట్ ఫ్లూరోఫాస్ఫేట్స్ గ్లాసెస్ డోప్డ్ విత్ రేర్ ఎర్త్ అయాన్స్ ఫర్ ఫొటానిక్స్ అప్లికేషన్స్ అంశంపై ప్రొఫెసర్ రత్నాకరం పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ● మైక్రోబయాలజీ స్కాలర్ కె.చెంచులక్ష్మి.. డినోటరేషన్ ఆఫ్ అఫ్లెటోక్సిన్ బై ప్రోబయాటిక్ ల్యాక్టోబేసిల్లస్ సాలివేరియస్ - ఎ స్టడీ ఆఫ్ హెచ్‌పీఎల్‌సీ అండ్ ఎంఎస్ అనాలసిస్ అంశంపై ప్రొఫెసర్ ప్రమోద కుమారి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

రైలు పెట్టెల మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించండి

డీఆర్ఎం విజయకుమార్



తిరుపతి రైల్వేస్టేషన్‌లో డీఆర్ఎం తనిఖీలు

తిరుపతి(ఆటోనగర్) సెప్టెంబరు 12: కోచింగ్ డిపోలో రైలు పెట్టెలకు చేస్తున్న మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గురువారం దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ మేనేజరు (డీఆర్ఎం) విజయకుమార్ ఆదేశించారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కోచింగ్ డిపోలో పనులను పరిశీలించి, సూచనలిచ్చారు. అనంతరం ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను పరిశీలించి, అధికారులతో సమావేశం నిర్వహించారు. సీఆర్ఎస్‌లో తనిఖీలు చేశారు. కోచ్ ఫిట్టింగ్, పెయింటింగ్, సీబీఆర్, ట్రైన్ లైటింగ్ తదితర విభాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో సీనియర్ స్కేల్ అధికారులు ప్రణయ్ కుమార్, మణికుమార్, రమణ, నగర్, తిరుపతి స్టేషన్ మేనేజరు డాక్టర్ చిన్నప్పరెడ్డిలతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గడువు ముగిసినా కొనసాగుతున్న క్యాంటీన్

● ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించినా కదలని నిర్వాహకులు

● ఎనిమిదేళ్లుగా రుయాస్పత్రి ఆవరణలో నామ మాత్రపు అద్దెతో కొనసాగుతున్న వైనం



చిన్నపిల్లల విభాగం ముందున్న క్యాంటీన్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 12: రుయాస్పత్రి ఆవరణలోనే అతి పెద్ద క్యాంటీన్ అది. నిత్యం డాక్టర్లతోపాటు, వైద్య విద్యార్థులు, రోగులు, వారి సహాయకులతో రాత్రీ పగలు రద్దీగా ఉంటుంది. ఈ క్యాంటీన్‌కు అధికారులు ఇచ్చిన టెండరు గడువు ముగిసి రెండేళ్లు అవుతోంది. దీంతో ఖాళీ చేయాలని సంబంధిత అధికారులు చెబుతున్నా నిర్వాహకులు కదలని పరిస్థితి చిన్నపిల్లల విభాగం ముందున్న క్యాంటీన్‌లో కొనసాగుతోంది. గతంలో ఎస్వీ వైద్య కళాశాలలో హెచ్‌వోడీ స్థాయి అధికారి కుమారుడి కోసం ఈ క్యాంటీన్‌ని రిజిస్ట్రేషన్ లేని ఏపీజీడీఏ అసోసియేషన్ పేరుతో ఏర్పాటు చేసి.. అందుబాటులోకి తీసుకొచ్చారు. తర్వాత దీన్ని కేవలం నెలకు రూ.25వేల నామమాత్రపు అద్దెతోనే సొంతం చేసుకున్నారు. క్యాంటీన్ ప్రారంభించిన కొన్నాళ్లకు హెచ్‌వోడీ స్థాయి అధికారి పదవీ విరమణ చేశారు. కానీ క్యాంటీన్ మాత్రం ఆయన కుమారుడి చేతిలోనే ఉండిపోయింది. దీంతో ఆయన మరొకరికి రెండింతల అద్దెతో సబ్‌లీజుకు ఇచ్చారు. అప్పటినుంచి నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారని విమర్శలు మొదలయ్యాయి. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్ ఆర్డర్లకు ప్రాధాన్యమివ్వడం మొదలుపెట్టారు. వీటిపై ఇటు వైద్యులు, అటు రోగుల నుంచి అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తడం మొదలయ్యాయి. మొత్తానికి అధికారులు ఈ క్యాంటీన్‌పై దృష్టిపెట్టారు. నామ మాత్రపు అద్దెతో దాదాపు ఎనిమిదేళ్లుగా ఒకే వ్యక్తి చేతిలో ఈ క్యాంటీన్ నడుస్తుందని.. టెండర్ గడువు ముగిసి కూడా రెండేళ్లవుతుందని గుర్తించారు. వెంటనే క్యాంటీన్ ఖాళీ చేయాలని మూడు నెలలుగా నిర్వాహకులకు అధికారులు ఆదేశాలిస్తున్నా వారు పట్టించుకోవడం లేదు. కాగా, గతంలో పనిచేసి పదవీ విరమణ చేసిన హెచ్‌వోడీ స్థాయి అధికారికి ప్రస్తుతం ఎస్వీ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న ఓ అధికారి అండగా ఉండటంతో క్యాంటీన్ నిర్వాహకులు పట్టించుకోవడం లేదని సమాచారం. ఈ నేపథ్యంలో ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు తీసుకుంటామని రుయా అధికారులు పేర్కొంటున్నారు.

చెవిలో పూలతో నిరసన



టీటీడీ పరిపాలనా భవనం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న శ్రీవారి మెట్టు వ్యాపారులు

తిరుపతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చెవిలో పూలు, నుదుటిపై మూడు నామాలు, మెడలో మాల ధరించి, చేతిలో భజన తప్పట్లు పెట్టుకుని శ్రీవారి మెట్టు వ్యాపారులు గురువారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. టీటీడీ పరిపాలన భవనం ఎదురుగా వీరు చేస్తున్న నిరసనలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర మాట్లాడారు. 23 రోజుల నుంచి నిరసన చేస్తున్నామన్నారు.

శ్రీవారిమెట్టు వద్ద దాదాపు 31 కుటుంబాలు గత ఇరవైఏళ్లుగా అక్కడే ఉండి జీవనం కొనసాగిస్తున్నారన్నారు. వారిని నిర్దయగా కిందకు దించడం సరైందికాదన్నారు. చిరుతపులి సాకుతో వీరి కుటుంబాలను వీధిన పడేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. తక్షణమే వీరికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వ్యాపారులు చిట్టిబాబు, మధు, రామ్మూర్తి, ప్రకాష్, చిరంజీవి, మల్లికార్జున, పెంచలయ్య, ప్రకాష్, సోను, గణేష్‌లు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని నష్టం

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

తిరుపతి(కపిలతీర్థం), సెప్టెంబరు 12: సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని నష్టమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయిలో ఉన్నా.. అత్యంత సాదాసీదా జీవితం గడిపినటువంటి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. తనకున్న అత్యంత సన్నిహితుల్లో ఏచూరి ఒకరని, ఆయన మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీపీఎం కార్యాలయంలో పుష్పాంజలి

తిరుపతి(ఆటోనగర్): యశోదనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఏచూరి చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కందారపు మురళి, వి.నాగరాజు, సి.పెంచలయ్య, పి.అంజయ్య, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచి పేరు తెచ్చుకోండి

స్కిల్ కాలేజ్ విద్యార్థులకు కలెక్టర్ సూచన



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 12: ఎంచుకున్న రంగంలో మంచి పేరు తెచ్చుకోవాలని స్కిల్ కళాశాల విద్యార్థులకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. అలిపిరి సమీపంలోని కళాశాలలో డెమి చెఫ్ ది పార్టీ (కిచెన్ సూపర్‌వైజర్), రెస్టారెంట్ కెప్టెన్ కోర్సుల్లో శిక్షణ పొంది.. ఉత్తీర్ణులైన విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ.. మంచి వృత్తి ఎంచుకున్నారని ప్రశంసించారు. ప్రిన్సిపాల్ రమణ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, రీజనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్యామ్‌మోహన్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న సప్తగిరి బస్సులు



తిరుపతి డిపో గ్యారేజీలో సిద్ధమవుతున్న బస్సు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 12: శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబరు నాల్గవ తేదీనుంచి జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు తిరుమలకు నలువైపుల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. ఈ నేపథ్యంలో ఘాట్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా ఆర్టీసీ తిరుపతి, చిత్తూరు జిల్లాల యంత్రాంగాలు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాయి. జూలై నుంచి సన్నాహక పనులు మొదలుపెట్టి ప్రస్తుతానికి చివరిదశలో నడుస్తోంది. తిరుమల, అలిపిరి, మంగళం, తిరుపతి, శ్రీకాళహస్తి, పుత్తూరు, సత్యవేడు డిపోలకు చెందిన 309, ఎలక్ట్రిక్ బస్సులు 65, చిత్తూరుజిల్లా డిపోల నుంచి 35బస్సులు తిరుమలకు రాకపోకలు సాగిస్తున్నాయి. కేవలం వీటిని మాత్రమే ఎంపిక చేసి డిపో గ్యారేజీలలో బస్సులకు మరమ్మతులు చేయడం, రంగులు వేయడం, పాడైన స్పేర్‌పార్ట్స్‌ను తొలగించి కొత్తవి అమర్చడం, స్టీరింగ్, ఇంజిన్, బ్రేకులు, లైట్లు, అద్దాలు వంటి విడిభాగాల లోపాలను గుర్తించి తొలగించడం, లైటింగ్ వంటి సాంకేతికపరమైన అంశాల తనిఖీలు ముమ్మరంగా చేశారు.

దారంతా గుంతలే..!



బురద, గుంతలతో నిండిన కేబీఆర్ నగర్ రోడ్డు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 12: మంగళం పరిధిలోని కేబీఆర్ (కాణిపాకం బాలాజీ రామేంద్రస్వామి)నగర్‌కు వెళ్లే దారి బురదతో నిండిపోయి గుంతలమయమైంది. ఇక్కడ నివాసముంటున్న దాదాపు 150 కుటుంబాలు ఇదే రోడ్డుపై రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బంది పడుతున్నాయి. ఎన్నికల ముందు మాజీ ఎమ్మెల్యేని స్థానికులు నిలదీయడంతో మొక్కుబడిగా గులక లేకుండా కేవలం ఎర్రమట్టి చల్లి సరిపెట్టేశారు. ఆ తర్వాత కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోయి రోడ్డు యథావిధిగా గుంతలతో కనిపిస్తోంది. కరకంబాడి ప్రధాన రోడ్డు నుంచి కేబీఆర్ నగర్‌కి వచ్చే మార్గంలో దాదాపు అర కిలోమీటర్ మేర రోడ్డు పూర్తిగా దెబ్బతిందని.. నడవడానికి కూడా అవస్థ పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్రవాహనదారులైతే అదుపుతప్పి కిందపడి గాయపడుతున్నారని చెప్పారు. శుక్రవారం మంగళంలో పర్యటించనున్న ఎమ్మెల్యే పులివర్తి నానీ అయినా ఈ రోడ్డును ఓసారి సందర్శించి.. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

చెత్తను తొలగించిన మున్సిపల్ సిబ్బంది



తిరుపతి(లీలామహల్), సెప్టెంబరు 12: లీలామహల్ సమీపంలోని సంజయ్‌గాంధీనగర్‌లో రోడ్డుపైనే చెత్త దిబ్బలు వేయడంతో 'తప్పెవరిది..?' అనే శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి కార్పొరేషన్ అధికారులు స్పందించారు. సిబ్బందితో చెత్తను తొలగించి, దోమలు ప్రబలకుండా బ్లీచింగ్ పిచికారి చేయించారు. అక్కడ చెత్త వేయరాదని సమీప నివాస ప్రజలకు తెలియజేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మ్యాన్‌హోల్ లీకేజీ సమస్య పరిష్కారం



తిరుపతి(గాంధీ రోడ్డు), సెప్టెంబరు 12: పీకే లేఅవుట్‌లో ఎస్ఎల్ఎస్ గ్రాండ్ హోటల్ (15వ డివిజన్) ఎదురుగా నెలకొన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ లీకేజీ సమస్యని గురువారం ఉదయం కార్పొరేషన్ సిబ్బంది పరిష్కరించారు. 'మ్యాన్‌హోల్ లీకేజీతో రోడ్డుపైకి మురుగునీరు' అన్న శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనంపై స్పందించి పలువురు ఇంజనీర్లు తమ సిబ్బందితో కలిసి సందర్శించారు. మ్యాన్‌హోల్‌కి మరమ్మతులు చేయడంతోపాటు రోడ్డుపై మురుగు లేకుండా తగు చర్యలు చేపట్టారు. అలాగే పరిసరాల్లో బ్లీచింగ్‌ని వేసి శుభ్రపరిచారు. ఎస్ఈ మోహన్, డీఈ ఎంఎన్‌టీ రాజు, ఎంఈ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతిలో సెటిలైతే బాగుంటుందన్పించింది

● నివేదా థామస్



శ్రీవారి ఆలయం ముందు నివేదా తదితరులు

తిరుపతి అర్బన్/ తిరుమల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): '35 చిన్నకథకాదు' సినిమా షూటింగ్ తిరుపతిలో జరిగినప్పుడు ఇక్కడే సెటిలైతే బాగుంటుందని అన్పించినట్లు హీరోయిన్ నివేదా థామస్ చెప్పారు. చెన్నైలో పుట్టి పెరిగిన తనకు తిరుపతి చాలా దగ్గరగా అన్పించిందన్నారు. '35 చిన్నకథకాదు' సక్సెస్ టూర్‌లో భాగంగా గురువారం తిరుపతిలో చిత్రబృందంతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. థియేటర్‌లో ప్రేక్షకుల స్పందన చాలా బాగుందని హీరో విశ్వదేవ్ చెప్పారు. '35 చిన్నకథకాదు' సినిమాను 60శాతం తిరుపతిలో చిత్రీకరించామని, భారీ విజయం సాధించడం సంతోషంగా ఉందని దర్శకుడు నందకిషోర్, నిర్మాత సిద్ధార్థ అన్నారు.

శ్రీవారు మాతోనే ఉన్నారు

పెద్దాయన వేంకటేశ్వరస్వామి దయతోనే '35 చిన్న కథ కాదు' చిత్రం మంచి విజయాన్ని సాధించిందని చిత్రబృందం సంతోషం వ్యక్తం చేసింది.గురువారం ఉదయం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న చిత్రబృందం ఆలయం ముందు మీడియాతో మాట్లాడింది. నివేదా థామస్ మాట్లాడుతూ తొలిసారిగా తాను శ్రీవారి దర్శనానికి వచ్చినట్టు తెలిపారు. దర్శకుడు నందకిషోర్ మాట్లాడుతూ.. సినిమాది తిరుపతి కథ కావడంతో విజయయాత్రను కూడా ఇక్కడినుంచే మొదలుపెట్టామన్నారు.

కొనసాగుతున్న కార్మికుల ధర్నా





పరిశ్రమ ఎదుట నిరసన తెలియజేస్తున్న కార్మికులు, సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నాయుడుపేట, సెప్టెంబరు 12: నాయుడుపేట మేనకూరు సెజ్‌లోని రాయల్ టెక్స్‌టైల్స్ కార్మికులు గురువారం కూడా ధర్నా చేశారు. కార్మికులకు తెలియజేయకుండా పరిశ్రమను లాక్‌అవుట్ చేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తపరిచారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివకవి ముకుంద మాట్లాడుతూ పరిశ్రమ లాక్ అవుట్ చేస్తే కార్మికులకు పూర్తి బెనిఫిట్స్ అందజేయాలన్నారు. పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ యాజమాన్యంతో మాట్లాడి ఈనెల 18వ తేదీ నిర్ణయం తీసుకుంటామన్నారు. ఐఎన్‌టీయూసీ నాయకులు ఎగుదల విజయ కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, పద్మమ్మ తదితరులు ఉన్నారు.

గూడూరు : నాయుడుపేట మండలంలోని మేనకూరు సెజ్‌లో గల రాయల్ టెక్స్‌టైల్స్ కర్మాగార కార్మికులను ఆదుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు కోరారు. గురువారం సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనాకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనకూరు సెజ్‌లో గల రాయల్ టెక్స్‌టైల్స్ కర్మాగారాన్ని కొద్దిరోజుల క్రితం మూసివేశారన్నారు. ఈ పరిశ్రమపై ఆధారపడి సుమారు 600 మంది కార్మికులు జీవిస్తున్నారన్నారు. పరిశ్రమను మూసివేయడంతో కార్మికులు జీవనోపాధిని కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరిని ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శివకుమార్, సురేష్, చంద్రయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

గడువు ముగిసినా కొనసాగుతున్న క్యాంటీన్

● ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించినా కదలని నిర్వాహకులు
● ఎనిమిదేళ్లుగా రుయాస్పత్రిలో నామ మాత్రపు అద్దెతో కొనసాగుతున్న వైనం



చిన్నపిల్లల విభాగం ముందున్న క్యాంటీన్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 12: రుయాస్పత్రి ఆవరణలోనే అతి పెద్ద క్యాంటీన్ అది. నిత్యం డాక్టర్లతోపాటు, వైద్య విద్యార్థులు, రోగులు, వారి సహాయకులతో రాత్రీ పగలు రద్దీగా ఉంటుంది. ఈ క్యాంటీన్‌కు అధికారులు ఇచ్చిన టెండరు గడువు ముగిసి రెండేళ్లు అవుతోంది. దీంతో ఖాళీ చేయాలని సంబంధిత అధికారులు చెబుతున్నా నిర్వాహకులు కదలని పరిస్థితి చిన్నపిల్లల విభాగం ముందున్న క్యాంటీన్‌లో కొనసాగుతోంది. గతంలో ఎస్వీ వైద్య కళాశాలలో హెచ్‌వోడీ స్థాయి అధికారి కుమారుడి కోసం ఈ క్యాంటీన్‌ని రిజిస్ట్రేషన్ లేని ఏపీజీడీఏ అసోసియేషన్ పేరుతో ఏర్పాటు చేసి.. అందుబాటులోకి తీసుకొచ్చారు. తర్వాత దీన్ని కేవలం నెలకు రూ.25వేల నామమాత్రపు అద్దెతోనే సొంతం చేసుకున్నారు. క్యాంటీన్ ప్రారంభించిన కొన్నాళ్లకు హెచ్‌వోడీ స్థాయి అధికారి పదవీ విరమణ చేశారు. కానీ క్యాంటీన్ మాత్రం ఆయన కుమారుడి చేతిలోనే ఉండిపోయింది. దీంతో ఆయన మరొకరికి రెండింతల అద్దెతో సబ్‌లీజుకు ఇచ్చారు. అప్పటినుంచి నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారని విమర్శలు మొదలయ్యాయి. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్ ఆర్డర్లకు ప్రాధాన్యమివ్వడం మొదలుపెట్టారు. వీటిపై ఇటు వైద్యులు, అటు రోగుల నుంచి అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తడం మొదలయ్యాయి. మొత్తానికి అధికారులు ఈ క్యాంటీన్‌పై దృష్టిపెట్టారు. నామ మాత్రపు అద్దెతో దాదాపు ఎనిమిదేళ్లుగా ఒకే వ్యక్తి చేతిలో ఈ క్యాంటీన్ నడుస్తుందని.. టెండర్ గడువు ముగిసి కూడా రెండేళ్లవుతుందని గుర్తించారు. వెంటనే క్యాంటీన్ ఖాళీ చేయాలని మూడు నెలలుగా నిర్వాహకులకు అధికారులు ఆదేశాలిస్తున్నా వారు పట్టించుకోవడం లేదు. కాగా, గతంలో పనిచేసి పదవీ విరమణ చేసిన హెచ్‌వోడీ స్థాయి అధికారికి ప్రస్తుతం ఎస్వీ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న ఓ అధికారి అండగా ఉండటంతో క్యాంటీన్ నిర్వాహకులు పట్టించుకోవడం లేదని సమాచారం. ఈ నేపథ్యంలో ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు తీసుకుంటామని రుయా అధికారులు పేర్కొంటున్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారిపై రెచ్చిపోయాడు!

● దుర్భాషలాడిన మున్సిపల్ మాజీ ఛైర్మన్



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ముత్యాల పార్థసారథి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12: శ్రీకాళహస్తి పురపాలకసంఘంలో టౌన్‌ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న మధుసూదనరావుపై మాజీ ఛైర్మన్ ముత్యాల పార్థసారథి బూతు పదజాలంతో రెచ్చిపోయాడు. ముక్కంటి ఆలయం ఎదుట జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ముక్కంటి ఆలయ నాల్గవ గేటు ఎదురుగా కృష్ణమందిరం పక్కనే సన్నిధివీధి రోడ్డుకు ఆనుకుని చాలాకాలంగా దుకాణాలున్నాయి.కృష్ణ మందిరం దక్షిణం వైపున ఒక వ్యక్తి రేకులతో తాత్కాలికంగా నిర్మించిన దుకాణాలు నడుపుకునేవాడు. ఇటీవల ఆ రేకులు తొలగించి శ్లాబ్‌తో శాశ్వత నిర్మాణం చేపట్టాడు. దీనిపై ఇన్‌ఛార్జి కమిషనర్ లలితకు కొందరు ఫోన్‌లో ఫిర్యాదు చేయడంతో టౌన్‌ప్లానింగ్ అధికారి మధుసూదన రావు సిబ్బందితో సన్నిధివీధికి చేరుకుని అక్కడ నిర్మాణంపై ఆరా తీశారు. రికార్డు ప్రకారం అది రోడ్డు పోరంబోకు స్థలం కాబట్టి శ్లాబ్ వేసేందుకు అనుమతి లేదంటూ పనులను అడ్డుకున్నారు.నిర్మాణం చేపట్టిన వ్యక్తి పురపాలకసంఘ మాజీ ఛైర్మన్ ముత్యాల పార్థసారథికి ఫోన్ చేసి పిలిచాడు.ఆయన రాగానే కృష్ణమందిరం పక్కన ఎన్నో శాశ్వత భవనాలు, నిర్మాణాలు ఉన్నప్పుడు ఈ ఒక్క నిర్మాణాన్ని ఎందుకు అడ్డుకుంటున్నారంటూ ప్రశ్నించారు.నీకు వగ ఉంటే అన్నీ కొట్టుకుంటూ రా... అంటూ దుర్భాషలాడారు.ఇదంతా ఎవరో వీడియో తీసి పెట్టడంతో సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది.ఈ విషయమై టౌన్ ప్లానింగ్ అధికారిని పార్థసారథి బూతు పదజాలంతో దూషించారంటూ ఇన్‌ఛార్జి కమిషనర్ లలిత ఓ పత్రికా ప్రకటన విడుదల చేసి ఊరుకున్నారు.టౌన్‌ప్లానింగ్ అధికారి మధుసూదన రావు మాత్రం పోలీసులకు ఫిర్యాదు చేసే అంశంపై అధికారులతో మాట్లాడి చెబుతానని తెలిపారు. కాగా 2019 వరకు టీడీపీలో కీలక నేతగా వుండిన ముత్యాల పార్థసారథి ఏడాది క్రితం వైసీపీలో చేరారు.ఈ యేడాది మార్చిలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత మళ్లీ టీడీపీలో చేరారు.

నేటి నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

చిట్టమూరు, సెప్టెంబర్ 12 : మండల పరిధిలోని మల్లాంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి 24వ తేదీ వరకు జరుగనున్నాయి. 13న అంకురార్పణ, 14న ధ్వజారోహణ, 17న ఫలాభిషేకం, నంది సేవ, 18న రథోత్సవం, 19న షణ్ముకస్వామి కల్యాణం, 20న కల్యాణ రాయబారం, 21న కల్యాణం, 22న వసంతోత్సవం, ధ్వజారోహణ, 23 అలకలదోషు, 24న ఊంజల్ సేవ, ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెళ్లకూరు, సెప్టెంబర్ 12 : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయి లక్ష్మి పేర్కొన్నారు. చిల్లకూరు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మల్లెమ్మ, ధనమ్మ పాల్గొన్నారు.

చీరలు, టవళ్లు పంపిణీ



గూడూరు, సెప్టెంబరు 12: విజయవాడలోని వరద బాధితుల సహాయక చర్యల్లో భాగంగా గూడూరు నియోజకవర్గ టీడీపీ ఆధ్వర్యంలో 5వేల కుటుంబాలకు చీరలు, టవల్స్, మస్కిటోకాయిల్స్‌ను అందజేసినట్లు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. గురువారం విజయవాడ లోని 43వ డివిజన్‌లో వరదబాధితులకు సహాయక చర్యలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజుల నుంచి స్థానిక నేతలతో కలిసి పర్యటిస్తూ బాధితులకు సామగ్రిని అందజేస్తున్నామన్నారు. గూడూరు నియోజక వర్గ టీడీపీ నాయకుల సహకారంతో రూ.7లక్షలతో ఈ సహాయక చర్యలను కొనసాగించామన్నారు. కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, సర్వోత్తమరెడ్డి, సతీష్‌రెడ్డి, నటశేఖర్, హరీష్ నాయుడు, చిరంజీవి, కీరవాణి పాల్గొన్నారు.

స్థానికుల భాగస్వామ్యంతోనే పోలేరమ్మ జాతర

● ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి,సెప్టెంబరు12:వెంకటగిరి పోలేరమ్మ జాతరను ప్రజల భాగస్వామ్యంతో వైభవంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామ కృష్ణ తెలిపారు. గురువారం జాతర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటు వంటి ఇబ్బందులు కలుగకుండా పుర ప్రజలు సహకరించాలని కోరారు. అదేవిధంగా పార్టీ కార్యాలయంలో భక్తుల కోసం కాల్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అమ్మవారి పుట్టినిల్లు అయిన కుమ్మరింట, జీనిగలవారి వీధిలోని అత్తవారిల్లుగా భావించే చాకలింట, కాంపాళ్యెంవద్ద ఉన్న గాలిగంగులు, అమ్మవారిని విరూపం చేసే విరూప మండపం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

జాతర విజయవంతం చేయాలి

పోలేరమ్మ జాతర విజయవంతం చేసేందుకు పుర ప్రజల సహకారంతోపాటు అధికారుల కృషి అవసరమని సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనన్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాల యంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన జాతర నిర్వహణపై అధికారులతో సమావేశం జరిగింది. సీఐ ఏవీ రమణ, ఎస్ఐ నాయక్, ఎండోమెంట్ ఏవో శ్రీనివాసుల రెడ్డి అధికారులు హాజరయ్యారు.

చెవిలో పూలతో శ్రీవారి మెట్టు వ్యాపారుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న శ్రీవారి మెట్టు వ్యాపారులు

తిరుపతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చెవిలో పూలు, నుదుటిపై మూడు నామాలు, మెడలో మాల ధరించి, చేతిలో భజన తప్పట్లు పెట్టుకుని శ్రీవారి మెట్టు వ్యాపారులు గురువారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. టీటీడీ పరిపాలన భవనం ఎదురుగా వీరు చేస్తున్న నిరసనలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర మాట్లాడారు. 23 రోజుల నుంచి నిరసన చేస్తున్నామన్నారు. శ్రీవారి మెట్ల వద్ద దాదాపు 31 కుటుంబాలు గత ఇరవైఏళ్లుగా అక్కడే ఉండి జీవనం కొనసాగిస్తున్నారన్నారు. వారిని నిర్దయగా కిందకు దించడం సరైందికాదన్నారు. చిరుతపులి సాకుతో వీరి కుటుంబాలను వీధిన పడేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. తక్షణమే వీరికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వ్యాపారులు చిట్టిబాబు, మధు, రామ్మూర్తి, ప్రకాష్, చిరంజీవి, మల్లికార్జున, పెంచలయ్య, ప్రకాష్, సోను, గణేష్‌లు పాల్గొన్నారు.

తిరుమలలో 10 అడుగుల కొండచిలువ పట్టివేత



పట్టుబడిన కొండచిలువతో భాస్కర నాయుడు

తిరుమల, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం సుమారు పది అడుగుల పొడవైన కొండచిలువ పట్టుబడింది. సేవాసదన్-2 గార్డెన్‌లోకి వచ్చిన ఈ పామును పలువురు సేవకులు, సిబ్బంది గమనించి హడలిపోయారు. భద్రతాసిబ్బంది సహాయంతో పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర నాయుడికి సమాచారమిచ్చారు. వెంటనే అయన అక్కడికి చేరుకుని కొండచిలువను చాకచక్యంగా పట్టుకుని దట్టమైన అడవిలో విడిచిపెట్టారు.

అక్రమంగా నిల్వ ఉంచిన టపాసుల పట్టివేత

పెళ్లకూరు, సెప్టెంబర్12: అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన టపాసులను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి పీఎంకే పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న కేఆర్ కాంప్లెక్స్‌లోని ఒక గదిలో అక్రమంగా టపాసులను నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. రూ.65 వేల విలువ చేసే టపాసులను స్వాధీనం చేసుకున్నారు. నిర్వహకులు గిరికుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్వీయూ మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్‌గా హేమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 12: ఎస్వీయూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా పి.హేమ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఉన్న దివాకర రెడ్డి స్థానంలో ఈమెను నియమిస్తూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. 2007లో వర్సిటీలో అధ్యాపకులుగా చేరిన ఈమె.. ఉమెన్ హాస్టల్ డిప్యూటీ వార్డెన్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ మెంబర్‌గా పని చేశారు. ఒక పుస్తకం, 30 పరిశోధనా వ్యాసాలు రాశారు.

విద్యార్థుల విరాళాల సేకరణ



గూడూరు, సెప్టెంబరు 12: విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం గురువారం పట్టణంలో స్వర్ణాంధ్ర భారతి విద్యార్థులు గురువారం పలు ప్రాంతాలలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నవకోటి నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో ఈ విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సేకరించిన విరాళాలను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సునీల్ రాజ్, హరికృష్ణ, సింధూ తదితరులు పాల్గొన్నారు

పర్యాటకరంగం అభివృద్ధికి కృషి చేయాలి : కలెక్టర్



సమావేశంలో ప్రసంగిస్తున్న వెంకటేశ్వర్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 12: జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్‌తో కలిసి జిల్లా పర్యాటక శాఖ కౌన్సిల్ ఛైర్మన్ హోదాలో గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. జిల్లాలో పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. పర్యాటక ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడం వల్ల పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేయొచ్చని వివరించారు. యాత్రికులను ఆకర్షించే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేయాలని చెప్పారు. ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు లఘు చిత్రలేఖన పోటీలు నిర్వహించడం వల్ల వారికి పర్యాటకరంగంపై ఆసక్తితోపాటు ఆయా పర్యాటక ప్రదేశాల గురించి అవగాహన కలుగుతుందన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, ఎస్వీ జూపార్క్ క్యూరేటర్ సెల్వం, మెప్మా పీడీ ప్రభావతి, డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

ఫెన్సింగ్ రాళ్ల ధ్వంసంపై ఫిర్యాదు



ఫెన్సింగ్ రాళ్లను ధ్వంసం చేస్తున్న దృశ్యం

చిల్లకూరు, సెప్టెంబరు 12: తన స్థలానికి సంబంధించిన ఫెన్సింగ్ రాళ్లను కొందరు ధ్వంసం చేసి తనపై దాడికి పాల్పడ్డారని గురువారం మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన కట్టా రామిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి రామిరెడ్డి వివరాల మేరకు... ముత్యాలపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 340లో తనకు 400 చదరపు గజాల స్థలం ఉందన్నారు. తన స్థలానికి రక్షణగా ఫెన్సింగ్ రాళ్లను, వైర్లను నాటి ఉన్నామన్నారు. అయితే ఇదే గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి రౌడీ మూకలను తీసుకువచ్చి తన ఫెన్సింగ్ రాళ్లను, తీగలను ధ్వంసం చేశారన్నారు. తనపై దాడికి పాల్పడ్డారన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

గణనాథుడి ఊరేగింపు



కోట, సెప్టెంబరు 12: మండల పరిధిలోని శ్యామసుందర పురం, కోట తదితర గ్రామాల్లో గురువారం వినాయక చవితి గ్రామోత్సవాలు జరిగాయి. వినాయకుడి విగ్రహాలతో గ్రామోత్సవాలు నిర్వహించారు. అనంతరం గణేష్ విగ్రహాలను కోట మండలం శ్రీనివాసనత్రం, వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రతీరంలో నిమజ్జనం చేసేందుకు తరలించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు
ముస్తాబవుతున్న సప్తగిరి బస్సులు



తిరుపతి డిపో గ్యారేజీలో సిద్ధమవుతున్న బస్సు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 12: శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబరు నాల్గవ తేదీనుంచి జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు తిరుమలకు నలువైపుల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. ఈ నేపథ్యంలో ఘాట్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా ఆర్టీసీ తిరుపతి, చిత్తూరు జిల్లాల యంత్రాంగాలు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాయి. జూలై నుంచి సన్నాహక పనులు మొదలుపెట్టి ప్రస్తుతానికి చివరిదశలో నడుస్తోంది. తిరుమల, అలిపిరి, మంగళం, తిరుపతి, శ్రీకాళహస్తి, పుత్తూరు, సత్యవేడు డిపోలకు చెందిన 309, ఎలక్ట్రిక్ బస్సులు 65, చిత్తూరుజిల్లా డిపోల నుంచి 35బస్సులు తిరుమలకు రాకపోకలు సాగిస్తున్నాయి. కేవలం వీటిని మాత్రమే ఎంపిక చేసి డిపో గ్యారేజీలలో బస్సులకు మరమ్మతులు చేయడం, రంగులు వేయడం, పాడైన స్పేర్‌పార్ట్స్‌ను తొలగించి కొత్తవి అమర్చడం, స్టీరింగ్, ఇంజిన్, బ్రేకులు, లైట్లు, అద్దాలు వంటి విడిభాగాల లోపాలను గుర్తించి తొలగించడం, లైటింగ్ వంటి సాంకేతికపరమైన అంశాల తనిఖీలు ముమ్మరంగా చేశారు.

తొణుకుమాల పొలాల్లో మృతదేహం వెలికితీత



వెంకటేశ్వర్లు మృతదేహం

చిల్లకూరు, సెప్టెంబరు12: తొణుకుమాల సమీపంలో ఈనెల 10వ తేదీన ఓ వ్యక్తిని హత్యచేసి మృతదేహాన్ని పూడ్చిపెట్టారనే సమాచారం కలకలం రేపింది. దీంతో గురువారం వైద్య, పోలీసు, రెవెన్యూ అధికారుల సమక్షంలో గుంటను తవ్వి మృతదేహాన్ని వెలికి తీశారు. గూడూరు తహసీల్దారు చంద్రశేఖర్, సీఐ కిషోర్ బాబు, ఎస్ఐ సురేష్‌బాబు సమక్షంలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. తొణుమాల సమీపంలోని ఓ తోటలో అంకయ్య, వెంకటేశ్వర్లు అనే ఇద్దరు కుటుంబ సభ్యులతో కలిసి కాపలాగా ఉంటున్నారు. వెంకటేశ్వర్లు, అంకయ్యలు సమీప పొలాల్లో స్టార్టర్లు, మోటార్లు అపహరించి అందులోని కాపర్‌ను విక్ర యిస్తుంటారు. వచ్చిన డబ్బులను పంచుకుంటుంటారు. ఈ క్రమంలో డబ్బుల పంపిణీ విషయమై వివాదం జరగడంతో అంకయ్య వెంకటేశ్వర్లు (32)ను హత్యచేసి పూడ్చివేసినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. 10వ తేదీ ఉదయం నుంచి అంకయ్య, వెంకటేశ్వర్లు, ఈయన భార్య తోటలో కనిపించక పోవడంతో తోట యజమానురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు అనుమానాస్పదంగా ఉన్న చోట గుంటను తవ్వడంతో వెంకటేశ్వర్లు మృతదేహం లభ్యమైంది. పరారీలో ఉన్న అంకయ్య, వెంకటేశ్వర్లు భార్య కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసునమోదు చేసుకుని విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జగన్‌ను కలిసిన వైసీపీ నేతలు



వెంకటగిరిటౌన్,సెప్టెంబరు12: మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను వైసీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య ఆ పార్టీ నేతలు భూమన అభినయ్, మోహిత్ రెడ్డిలు గురువారం భేటీ అయ్యారు. నియోజకవర్గాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారని తెలిపారు. జిల్లాలో వైసీపీ బలోపేతం అయ్యేందుకు కృషి చేయాలని కోరారు.

ఇద్దరికి డాక్టరేట్ల ప్రదానం





సూర్యనారాయణ, చెంచులక్ష్మి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 12: ఎస్వీయూలో ఇద్దరికి డాక్టరేట్లు ప్రదానం చేసినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు. ● ఫిజిక్స్ స్కాలర్ బోనం సూర్యనారాయణ దేవర.. స్ట్రక్చరల్ అబ్జార్షన్ అండ్ ఎమిసన్ స్టడీస్ ఆన్ డిఫరెంట్ ఫ్లూరోఫాస్ఫేట్స్ గ్లాసెస్ డోప్డ్ విత్ రేర్ ఎర్త్ అయాన్స్ ఫర్ ఫొటానిక్స్ అప్లికేషన్స్ అంశంపై ప్రొఫెసర్ రత్నాకరం పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ● మైక్రోబయాలజీ స్కాలర్ కె.చెంచులక్ష్మి.. డినోటరేషన్ ఆఫ్ అఫ్లేటోక్సిన్ బై ప్రోబయాటిక్ ల్యాక్టోబేసిల్లస్ సాలివేరియస్ - ఎ స్టడీ ఆఫ్ హెచ్‌పీఎల్‌సీ అండ్ ఎంఎస్ అనాలసిస్ అంశంపై ప్రొఫెసర్ ప్రమోద కుమారి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మేధో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేసి వైదిక క్రతువులు నిర్వహించారు. స్వామివారిని అభిషేకించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

చిట్టి చేతులు... పెద్ద సాయం



విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితుల కోసం భారత్ అండ్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో పట్టణంలో ఇంటింటికి వెళ్లి విరాళాలు సేకరించారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, బాబు అగ్రహారం పురపాలకసంఘ ఉన్నత పాఠశాలకు చెందిన 50మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. రూ.35వేలు సేకరించి జిల్లా రోవర్ కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబుకు అందజేశారు. ఈ విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు సౌభాగ్యలక్ష్మి, జిల్లా యువజన విభాగం ఛైర్మన్ షేక్ అజారుద్దీన్ పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదానం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో జనసేన ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు సుమారు 400మంది ఎదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పేట చంద్రశేఖర్, చిరంజీవి, జ్యోతిరామ్, రవికుమార్ రెడ్డి, దినేష్, సురేష్, మణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు



వరదయ్యపాళెం, సెప్టెంబరు 12: మరదవాడ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో దేవకుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత మునీశ్వర్‌రెడ్డిని గురువారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మునీశ్వర్‌రెడ్డి మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చెంచురెడ్డి, సునీల్‌రెడ్డి, మునిరెడ్డి, మహేంద్రనాథ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మురళిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం నాయుడి మృతికి సంతాపం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12: తొట్టంబేడు మండలం గుర్రప్పనాయుడు కండ్రిగకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సుబ్రహ్మణ్యం నాయుడు మృతి బాధాకరమని మండల అధ్యక్షుడు గాలి మురళీనాయుడు అన్నారు. గురువారం ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, టీడీపీ నాయకులు ఎస్వీ దిలీప్‌నాయుడు, సర్పంచ్ బాలాజీనాయుడుతదితరులు పాల్గొన్నారు. సుబ్రహ్మణ్యం నాయుడు మృతికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఫోన్ ద్వారా సంతాపం తెలియజేశారు.

మరిన్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టులు అవసరం



హాజరైన ప్రతినిధులతో కేవీ రమణ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12: అత్యాచార బాధితుల కోంస మరఇన్ని ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు అవసరమని ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ అన్నారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా భవనంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యాచారం, లైంగిక వేధింపు బాధితులకు తక్షణమే న్యాయం చేకూర్చడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు మాత్రమే సహకరిస్తాయన్నారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఉత్సవాలు శుక్రవారం నుంచి మంగళవారం వరకు జరుగుతాయన్నారు. భక్తులు, సిబ్బంది తెలియక చేసిన దోషాల నివారణకు ఏటా ఇలా పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు.

రేపు లోక్ అదాలత్



శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12 పట్టణంలోని న్యాయస్థానంలో శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు ఉపయోగించుకోవాలని శ్రీకాళహస్తి అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని రకాల కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఇరువర్గాలు విజేతలేనన్నారు. అన్ని శాఖల అధికారులు లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేయాలని తెలిపారు.

ముక్కంటి సేవలో గోవా మంత్రి



ఆలయం వద్ద గోవా మంత్రి విశ్వజిత్ రాణె

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12: శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం గోవా అర్బన్ డెవలప్, అటవీశాఖ మంత్రి విశ్వజిత్ రాణె కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అప్పలాయగుంటలో ప్రసన్న వెంకటేశ్వర స్వామిని కూడా మంత్రి కుటుంబ సమేతంగా దర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు అర్చన చేయించారు. అనంతరం మంగళ హారతులిచ్చారు.

సీఆర్ఎస్‌లో డీఆర్ఎం తనిఖీలు



తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 12: తిరుపతి పర్యటనలో భాగంగా డీఆర్ఎం గురువారం సీఆర్ఎస్‌లో తనిఖీలు నిర్వహించారు. కోచ్ ఫిట్టింగ్, పెయింటింగ్, సీటీఆర్, ట్రైన్ లైటింగ్ తదితర విభాలను పరిశీలించారు. రైలుపెట్టెల మరమ్మతుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. అంతకుముందు తిరుపతి రైల్వేస్టేషన్‌లోనూ తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో సీనియర్ స్కేల్ అధికారులు ప్రణయ్ కుమార్, మణికుమార్, రమణ, నగర్, తిరుపతి స్టేషన్ మేనేజరు డాక్టర్ చిన్నప్ప రెడ్డిలతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిద్ధ ఔషధ నేత్ర చికిత్సకు స్పందన



వరదయ్యపాళెం, సెప్టెంబరు 12: వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం ఏకం ఆలయ ప్రాంగణంలో లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం కలిక్కం సిద్ధ ఔషద నేత్ర చికిత్సకు విశేష స్పందన లభించింది. సుమారు 150 మంది వైద్యశిబిరంలో పాల్గొన్నారు. సంస్థ సభ్యులు లోకేష్ దాసాజీ ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని అరుదైన మూలికల సారాలను కళ్లలో వేయడం వల్ల పలు వ్యాధులు నయమవుతాయన్నారు. కార్యక్రమంలో సతీష్, ముత్తుకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

రైతులకు వ్యవసాయ అధికారుల సూచన



పూలతోటను పరిశీలిస్తున్న అధికారులు

సత్యవేడు, సెప్టెంబరు 12: పుష్పాలు, వరిపంటలో అధిక దిగుబడుల సాధనపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం సత్యవేడు మండలం వెంకటరాజుల కండ్రిగ రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఏవో మురళి ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా తిరుపతి(డీఆర్సీ) వ్యవసాయ అధికారి శ్రీనివాస్, చిత్తూరు ఆత్మ వ్యవసాయ అధికారి శశిధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వరి పంటలో అధిక దిగుబడులు సాధించడానికి మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. ప్రధానంగా విత్తనాలు చల్లుకోవడం ద్వారా వరి సాగు చేసిన రైతులు కలుపు యాజమాన్యం సక్రమంగా నిర్వహించాలన్నారు. విత్తనం ఎంపిక, విత్తనశుద్ధి, నారుమడులు ప్రధాన పొలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. వరిలో మేలైన అధిక దిగుబడి సాధించడానికి యంత్రాలతో వరినాట్లు, కాలి బాటలు తీయడం, సూక్ష్మ పోషకాలు, జింక్ సల్ఫేట్, కాంప్లెక్స్ ఎరువులను దుక్కిలోనే వేయడంతో బాటు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం తదితర అంశాలపై మండల వ్యవసాయ అధికారి మురళి వివరించారు. అనంతరం రైతులు సాగు చేసిన పూల తోటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్ కండ్రిగ, గ్రామ సర్పంచ్ సుజాత, గ్రామ వ్యవసాయ సహాయకులు స్వర్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

రాజకీయ సమాధి చేసేందుకు ఎమ్మెల్యేపై కుట్ర

●దళిత సంఘాల నాయకుల ఆగ్రహం



ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 12: ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని ట్రాప్ చేయడానికి సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని నియోజకవర్గంలోని ఏడు మండలాల దళిత నాయకులు, 28 పంచాయతీల దళజత మహిళలు దళిత సంఘాల ఆధ్వర్యంలో గురువారం వరదయ్యపాళెం బస్టాండు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు మైకు నందయ్య మాట్లాడుతూ అమాయకుడైన ఆదిమూలాన్ని కావాలనే ట్రాప్‌లోకి దింపి రాజకీయ సమాధి కట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. మహిళ విడుదల చేసిన వీడియో, హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్లపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఇందులో నిజాన్ని నిగ్గు తేల్చాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం బస్టాండు నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి ఎస్ఐ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కిషోర్, దళిత మహిళలు, నాయకులు, ఇతరవర్గాల నాయకులు పాల్గొన్నారు. **సత్యవేడు:** దళిత సంఘాలు నాయకులు గురువారం సత్యవేడులో ధర్నా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి శ్రీకాళహస్తి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదిమూలాన్ని వ్యక్తిగత స్వార్థంతో కొందరు కేసులో ఇరికించాలని ఆరోపించారు. కుట్రలో భాగస్వాములపై కేసు నమోదు చేయాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దళిత నాయకులు ధనశేఖర్, అరుణ్‌నాథన్, కుబేస్త్రన్, వెంకటరమణ, టీడీపీ నాయకుడు చిన్నా, బాలమురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



సత్యవేడు, సెప్టెంబరు 12: వికసిత్ ఆంధ్రప్రదేశ్ అంశంపై మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు గురువారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. బహుమతులు అందజేశారు. వక్తృత్వ పోటీల్లో విజేతలు పి.జీవిత (జడ్పీ హైస్కూలు, పుదుకుప్పం), ప్రశాంత్ (జడ్పీ హైస్కూలు, మదనంబేడు), చందన సాయి (అంబేడ్కర్ గురుకుల), వ్యాసరచన పోటీల్లో పి.జీవిత (జడ్పీ హైస్కూలు, పుదుకుప్పం), మహాలక్ష్మి(అంబేడ్కర్ గురుకుల), నివేద(హైస్కూలు బాలికల సత్యవేడు)లకు ఎం.యు.రవి బహుమతులు అందజేశారు.

కలుజు కాలువను కాపాడాలని రైతుల వినతి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12: మండలంలోని బోనుపల్లిపంచాయతీ పరిధిలో ఉన్న కొదగుంట చెరువు కలుజు కాలువను కాపాడాలంటూ గ్రామస్థులు గురువారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు రైతులు మాట్లాడుతూ 50 అడుగుల విస్తీర్ణం ఉన్న కలుజు కాలువను ఇద్దరు రైతులు పూడ్చేసి తమ భూమిలో కలిపేసుకోవడంతో నీరు పారే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఫలితంగా పక్కనే ఉన్న పొలాలపై ప్రవహిస్తున్న పంటలను నష్టపోతున్నట్లు వాపోయారు. కాలువే లేకుండా చేస్తే రైతులకు సాగునీరు ఎలా అందుతుందని ప్రశ్నించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. చిట్టిబాబు, శంకరయ్య, జగదీష్, మాజీ ఎంపీటీసీఎల్లయ్య పాల్గొన్నారు.

ఆటోలో 15 సవర్ల బంగారం చోరీ

రేణిగుంట, సెప్టెంబరు 12: ఆటోలో 15 సవర్ల బంగారు నగలు చోరీ అయ్యాయి. బాధితురాలు కథనం ప్రకారం.. కార్వేటినగరంలో ఉంటున్న వకీషా ఏర్పేడులో శుభ కార్యానికి హాజరయ్యేందుకు గురువారం బంధువులతో కలిసి ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. గాజులమండ్యం కూడలి వద్ద సాయంత్రం దిగి. అక్కడి నుంచి బంధువు ద్విచక్ర వాహనంలో పాత చెక్‌పోస్టు వద్దకు చేరుకుంది. తర్వాత షేర్ ఆటోలో ఏర్పేడు ప్రయాణిస్తుండగా ఇద్దరు మహిళలు వకీషా పర్సులోని 15 సవర్ల బంగారు నగలను చోరీ చేశారు. బంధువుల ఇంటికి వెళ్లిన తరువాత చోరీ అయిన విషయాన్ని ఆమె గుర్తించింది. వెంటనే రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితురాలు పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

యోగా పోటీల్లో మొదటి బహుమతి



బహుమతి అందుకుంటున్న అయిలం సుజాత

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12: వైఎస్ఏ సంస్థ నిర్వహించిన యోగా పోటీల్లో పట్టణానికి చెందిన శివసాయి యోగా సెంటర్ నిర్వాహకురాలు అయిలం సుజాత మొదటి బహుమతి పొందారు. జిల్లాస్థాయి యోగాసన ఛాంపియన్‌షిప్ పోటీలు తిరుపతిలో జరిగాయి. సుజాత శిష్యులు శ్రీనిధి, వరదన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని వీఎస్ఏ అధ్యక్షులు కైలాష్, కార్యదర్శి మునిమంజుల అభినందించారు.

ఎస్ఐకి సన్మానం

కేవీబీపురం, సెప్టెంబరు 12: ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన వీరాంజనేయులును మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజులనాయుడు, తిరుపతి పార్లమెంటరీ రైతు అధ్యక్షులు గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నాయకులు సురేష్‌రెడ్డి, లక్ష్మీపతిరాజు, మనోహర్, వెంకటేష్, నాగరాజురెడ్డి, శివరావు, వెంకటేష్, నాగరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి మరణం తీరని లోటు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12:: కమ్యూనిస్టు నేత, అజాతశత్రువుగా అందరి మన్ననలు అందుకున్న సీతారాం ఏచూరి మృతి దేశానికి తీరని లోటు అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఒక ప్రకటనలో ఆయన సంతాపం వ్యక్తం చేశారు. వామపక్ష ఉద్యమాల్లో సీతారాం కొత్తపంథా తీసుకువచ్చారన్నారు. సిద్ధాంతపరంగా విభేదాలు ఉన్నవారితో సైతం ప్రజా అవసరాల కోసం ఆయన చేసిన ఐక్యపోరాటాలు అందరికి ఆదర్శనీయమన్నారు. **కేవీబీపురం:** సీపీఎం నాయకుడు సీతారాం ఏచూరి మరణం తీరని లోటు అని సీపీఎం నాయకులు దాసరి జనార్దన్ సంతాపం ప్రకటించారు. గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో నాగరాజు, వెంకటేశ్వర్లు, దేశమ్మ, చంద్రయ్య, కళావతి, మోహనమ్మ, వీరమ్మ పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.56 కోట్లు

తిరుమల, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.56 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఆదాయ వివరాలను టీటీడీ గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 67,668 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,157 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

పుత్తూరు వార్తలు

సరైన పద్ధతులు పాటిస్తే మామిడి సాగు లాభదాయకం



సమావేశంలో మాట్లాడుతున్న మాధవయ్య

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 12: సరైన యజమాన్య పద్ధతులు పాటిస్తే మామిడి రైతులకు అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా వనరుల సహాయ వ్యవసాయ సంచాలకులు భాస్కరయ్య తెలిపారు. గురువారం డీఆర్సీ తరపున మండలంలోని నేసనూరు గ్రామంలో జిల్లా వనరులు కేంద్రం ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాధవయ్య మాట్లాడుతూ సరైన పద్ధతులు పాటిస్తే ఉత్పత్తులు పెరిగి రైతులు లాభాల బాట పట్టవచ్చన్నారు. వ్యవసాయంపై మక్కువ తగ్గడం, రియల్ ఎస్టేట్ వైఖరి కారణంగా వ్యవసాయ రంగం కుదేలవుతోందన్నారు. జిల్లా వనరుల సహాయ సంచాలకులు భాస్కరయ్య, వ్యవసాయ అధికారి ఏడీఏ రమేష్, మండల వ్యవసాయాధికారి కోదండయ్య, ఉద్యాన అధికారి సౌజన్య ఏవో, డీఆర్‌సీడీ వేణుగోపాల్, రైతులు పాల్గొన్నారు.

ఏచూరి మృతికి సంతాపం

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 12: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం మృతి ప్రజా ఉద్యమాలకు తీరని వేదనను మిగిల్చిందని పట్టణ పార్టీ కార్యదర్శి వెంకటేష్ పేర్కొన్నారు. పేదలు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగుల కోసం పోరాటాలు చేశారని సంతాపం ప్రకటించారు. శుక్రవారం జరిగే సంతాప కార్యక్రమానికి పార్టీ నాయకులు, ప్రజా సంఘ నాయకులు, ఉద్యోగ నాయకులు హాజరు కావాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలతో విద్యార్థుల వినూత్న ప్రదర్శన

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సిటిజన్ వెల్ఫేర్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని బస్టాండు వద్ద వినూత్నంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆక్సిజన్ ఉత్పత్తి చేసే మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలన్నారు. భవిష్యత్ తరాలకు మంచి ప్రకృతిని అందించాలంటే ప్రస్తుతం పర్యావరణాన్ని రక్షించాలన్నారు. కార్యక్రమంలో చరణ్‌సాయి, చంద్రారెడ్డి, కోలా సంగీత పాల్గొన్నారు.

విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందించాలి

ఏర్పేడు, సెప్టెంబరు 12: రైతులకు విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు రాయితీ కింద అందించాలని రైతుసంఘం నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు కందాడు పంచాయతీలోని రెవెన్యూ అధికారి తులసమ్మకు రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి హేమలత, రంగయ్య, శంకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, కుమారస్వామి పాల్గొన్నారు. .

టీసీఎల్‌లో ఈఎస్ఐ వైద్యశిబిరం



ఏర్పేడు, సెప్టెంబరు 12: ఏర్పేడు మండలం వికృతమాల వద్ద టీసీఎల్ పరిశ్రమలో గురువారం ఈఎస్ఐ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ క్యాంప్ ఇన్‌ఛార్జి డాక్టర్ గోపీనాథ్, వైద్యులు ధనలక్ష్మి, రాజు, సిబ్బంది హేమలత, చిరంజీవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో పోలీసుల సోదాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12: శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్‌లో 1టౌన్ సీఐ గోపి పోలీసు సిబ్బందితో కలిసి గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు గురువారం రాత్రి సీఐ గోపి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. క్షుణ్ణంగా స్టేషన్ పరిసరాలను జల్లెడ పట్టారు. ప్రయాణికులకు భద్రత, శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే సమాచారం ఇవ్వాలని కోరారు.

కొయ్య బొమ్మల కళాకారుల సమస్యలు పరిష్కరించండి



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12: కొయ్య బొమ్మల కళాకారుల సమస్యలను పరిష్కరించాలని శ్రీకాళహస్తికి చెందిన కళాసృష్టి ప్రైవేటు సంస్థ కార్యదర్శి దశరథాచారి కోరారు. శ్రీకాళహస్తిలోని కొయ్యబొమ్మల హస్తకళాకేంద్రాన్ని హస్త కళ జౌళి శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా దశరథాచారి మాట్లాడుతూ కొయ్యబొమ్మల కళాకారుల ఉన్నతికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎర్రచందనం చెక్క, ముడి పదార్థాలకు సబ్సిడీ దరను అందించాలని, కళాకారులకు క్రెడిట్‌కార్డు, ఆరోగ్య బీమా, ముడి పదార్థాల డిపో ఏర్పాటు చేయాలని కోరారు. జౌళి శాఖ దక్షిణ భారతదేశ ప్రాంతీయ డైరెక్టర్ లక్ష్మణరావు, తిరుపతి హస్తకళ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ సత్యమూర్తి పాల్గొన్నారు.

చెక్కబొమ్మలను పరిశీలిస్తున్న జౌళిశాఖ ప్రాంతీయ డైరెక్టర్ లక్ష్మణరావు